



హిందూపురంలో బంద్ చేసిన హోల్‌సేల్ నూనెల దుకాణం



నూనెలపై దిగుమతి సుంకం పెంచేస్తున్నట్లు ప్రచారం జరగ్గానే.. వ్యాపారులు దోపిడీకి తెరలేపారు. వారి వద్దనున్న నూనెలను బ్లాక్ చేసేశారు. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టిస్తూ కాసులవేట సాగిస్తున్నారు. చాలా దుకాణాల్లో పెద్ద పరిమాణంలో నూనె అడిగితే లేదని చెబుతున్నారు. కొందరైతే ఏకంగా షాపులనే బంద్ చేసేసుకుంటున్నారు. పాత రేటుతో వారు కొనుగోలు చేసిన సరుకునే పెరగనున్న ధరల ప్రకారం అమ్మి జనాలను లూటీ చేసే పన్నాగం పన్నారు. అందులో భాగంగానే వ్యాపారులు.. నూనెల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

- హిందూపురం

ధరల మాటున దోపిడీ..!

మార్కెట్‌లో కనిపించని నూనెలు

కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

వినియోగదారులపై భారం

మూడు రోజుల్లోనే కిలోపై రూ.20 నుంచి రూ.30దాకా పెంపు

ఒక్కసారిగా పెంపు

నిత్యావసర సరుకుల ధరలు ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. వీటిని భరించ లేక సతమతమవుతున్న ప్రజలకు పుండు మీద కారం చల్లినట్లు నూనె కూడా మరుగుతోంది. నూనెల ధరలు ఒక్కసారిగా పెద్ద మొత్తంలో పెరుగుతుండడం వారిపై మోయలేని భారం వేస్తోంది. కొనలేక, వాడకుండా ఉండలేక సతమతమవుతున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు దిగుమతి సుంకం పేరుతో వారంలోపే కిలో నూనెపై రూ.20నుంచి రూ.30దాకా ధరలు పెంచారు. కొంత మంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ దోచుకుంటున్నారు. జిల్లాలో కొంతమంది హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు నాలుగైదు రోజులుగా కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలు పెంచుతున్నారు. వీరంతా సహజంగానే టన్నుల్లో కొనుగోలు చేసి, నిలువ చేసుకుంటూ విక్రయాలు సాగిస్తుంటారు. వారం రోజుల క్రితం నూనె ధరలు పెరగడంతో కొత్తగా వచ్చిన సరుకు కాకుండా నిలువ ఉంచుకున్న దాని పైనే ధరలు పెంచుతున్నారు. తద్వారా రూ.లక్షల్లో వినియోగదారులపై భారం మోపుతున్నారు.

కల్తీకి రెక్కలు

మార్కెట్‌లో ఒక్కసారిగా వంట నూనె ధరలు పెరగడంతో లూజు విక్రయాలు పెరిగాయి. వీటిచాటున కల్తీ విక్రయాలు జోరందుకునే అవకాశం ఉంది. రోడ్డుపక్కన ఉండే అల్పాహార దుకాణాల హోటళ్లు, మాంసాహారం విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్లు, కల్తీనూనె ఎక్కువగా వాడే ప్రమాదం ఉందని వినియోగదారులు వాపోతున్నారు. లూజు నూనెలో ఏది కల్తీనో, ఏది నాణ్యమైందో తెలియని పరిస్థితి. దీని వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే గతంలో హిందూపురం కేంద్రంగా కల్తీనూనె తయారుచేసి హైదరాబాద్‌కు సైతం విక్రయించిన సందర్భాలున్నాయి. దీనిని బట్టి చూస్తే జిల్లాలో కల్తీనూనె జోరందుకునే అవకాశం ఉంది. దీనిచాటున వ్యాపారులు కూడా కల్తీనూనెకు అలవాటుపడే అవకాశం లేకపోలేదు.





నెలకు రూ.10కోట్లు భారం

పెరిగిన ధరల ప్రకారం వినియోగదారులపై కనీసం రూ.10కోట్లు అదనపు భారం పడనుంది. ఉమ్మడి జిల్లాలో నెలకు 60లక్షల నుంచి 70లక్షల కిలోలు వినియోగిస్తున్నట్లు అంచనా. దీపాలనూనెపై కూడా కిలోపై రూ.20 పెంచారు. ఇదికూడా ఉమ్మడి జిల్లాలో నెలకు 3లక్షల లీటర్లు వినియోగిస్తున్నట్లు అంచనా. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాల వినియోగదారులపై రూ.10కోట్లదాకా అదనపు భారం పడనుంది. వచ్చే పండగలకు నూనె ఖర్చు అధికంగా అవసరం అవుతుంది. నూనె వంటలే ఎక్కువగా చేసుకుంటారు.

కృత్రిమ కొరత

దిగుమతి సుంకం పెంచారన్న నెపంతో నూనెపై కొంతమేర ధర పెరిగిన మాట వాస్తవమేనేమో. దానిని సాకుగా తీసుకుని వ్యాపారులు నాలుగైదు రోజుల వ్యవధిలోనే ధరలు పెంచేశారు. పాత స్టాకు ఉన్నా.. లేదని చెప్పుకుంటున్నారు. 10కిలోల లోపైతే ఇస్తున్నారు. అంతకంటే ఎక్కువ అడిగితే సరుకులేదని చెప్పేస్తున్నారు. మరికొందరైతే ఒకట్రెండు రోజులు స్టాక్‌లేదని షాపులు బంద్ చేశారు. ప్రొద్దుతిరుగుడు నూనె 15కిలోల డబ్బా గత శుక్రవారం రూ.1730 ఉండేది. ఆది, సోమవారం నాటికి రూ.2వేలకు పెంచారు. కిలోపై రూ.17 పెరిగిందన్న మాట. పామాయిల్ రూ.1530 ఉండగా మంగళవారం నాటికి రూ.1750 చేశారు. కిలో రూ.95ఉండగా నాలుగురోజుల్లోనే రూ.123కు పెంచారు. అంటే కిలోపై రూ.28 పెరిగింది. దీనికితోడు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలు పెంచుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు.





జిల్లాలో దాడులేవీ?

దిగుమతి సుంకం పేరుతో జిల్లాలో నూనె దుకాణాల్లో ధరలు పెంచారు. రాష్ట్రంలో చాలా జిల్లాల్లో మంగళవారం దాడులు నిర్వహించారు. జిల్లాలో ధరలు నియంత్రించాల్సిన అధికారులెవరూ కన్నెత్తి చూడకపోవడం విశేషం. విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు దీనిపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. వినియోగదారులు శాపనార్థాలు పెడుతున్నారు. వారంలోనే కిలోపై రూ.20నుంచి రూ.30 ధరలు పెంచడంతో బెంబేలెత్తుతున్నారు. సంబంధిత అధికారులు దాడులు చేసి, ధరల మాటున దోపిడీని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లేపేస్తా..

నాతోనే గేమ్స్ ఆడతావా?

సచివాలయ ఉద్యోగిని బండబూతులు తిట్టిన టీడీపీ నాయకుడు

సోషల్ మీడియాలో ఆడియో వైరల్



మంత్రి సవితతో ఉన్న టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ (ఫైల్)

హిందూపురం, సెప్టెంబరు 19: 'నాకు రాజకీయం తెలుసు.. రౌడీయిజం తెలుసు.. నేను ఉలవలు పంచవద్దని చెప్పినా.. ఎందుకు పంపిణీ చేశావ్? నాతోనే గేమ్స్ ఆడతావా.. నిన్ను లేపేస్తా..' అంటూ టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి శాసనకోట వెంకటేశ్.. గ్రామ సచివాలయ ఉద్యోగిని బండబూతులు తిట్టాడు. పరిగి మండలం శాసనకోట గ్రామ సచివాలయ ఉద్యోగి పవన్‌కుమార్ రెడ్డికి బుధవారం టీడీపీ నాయకుడు వెంకటేశ్ ఫోన్ చేశాడు. ఈ సందర్భంగా పదినిమిషాలపాటు ఉద్యోగిని పత్రికలో రాయలేని విధంగా దుర్భాషలాడాడు. మంత్రి సవితకు సన్నిహితంగా ఉండే సదరు నాయకుడు సచివాలయ ఉద్యోగిపై దుర్భాషలాడిన ఆడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మొదట సచివాలయ ఉద్యోగి నమస్తే అన్నా.. అన్నాడు. టీడీపీ నాయకుడు ఒక్కసారిగా రెచ్చిపోయాడు. 'నీ నమస్తే నాకు అవసరమా? తొక్కిపడేస్తా.. నీవు ఏమైనా కలెక్టరా, నేను చెప్పేవరకు ఉలవలు పంచకూడదన్నాను కదా. నాకు రాజకీయంలో 20ఏళ్ల అనుభవం, నీలాంటి వారిని చాలా మందిని చూశా, నీవు ఫోన్‌చేస్తే నేను ఎత్తాలా..? నేను ఫోన్ ఎత్తకపోతే వేరేవారికి ఫోన్‌చేస్తావా..? ఎవరెవరికో ఫోన్‌చేసి నాకు చెప్పమంటావా, ఊర్లో రాజకీయం తెలిసింది నీకొక్కడికేనా, నాకు తెలియదా? ఎన్ని రోజుల నుంచి ఫోన్ చేస్తున్నావు నీవే చెప్పు. పార్టీకి కష్టపడినవారు లక్ష మంది ఉన్నారు. వారికి కాకుండా నీకు ఇష్టమొచ్చిన వారికి ఇస్తావా? ఈ వెంకటేశ్ చాలా క్రిమినల్. నా కొ... మీ తాత వచ్చినా నేను వినను. మీలాంటి వారికోసం ఒక నిమిషం కూడా వెయిట్ చేయను. అలాంటిది అరగంటపాటు నీకోసం వెయిట్ చేశా. నాకు తిక్కరేగితే ఎవరూకూడా లెక్కలేదు. అలాంటిది నీకోసం అరగంట ఆగాలా? నీకు ఉద్యోగం ఇచ్చిన వాడెవరు, నేను రాత్రే చెప్పా.. మా పార్టీవారికి ఇవ్వమని. అది చేయలేదు. ఏరా రాజకీయం నేర్పుతావా? నా కంటికి కనిపిస్తే పాతేస్తా. నీ ఏఓ, ఏడీలను పంపించు. జీతం తీసుకుంటున్నారు కదా, పంచమని చెప్పు. నా దగ్గర గేమ్స్ ఆడతావా? అవన్నీ నా వద్ద సాగవు. నేను అన్నీ చూశా. పేదవారికి సాయం చేయమని చెప్పా. నేను టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిని. నా హోదా తెలుసుకుని చెప్పు. ఎక్కడుందిరా స్టాక్ అంటూ ముగించాడు.' ఈ ఆడియో సాగినంతసేపు సచివాలయ ఉద్యోగి సున్నితంగా మాట్లాడాడు. ఈ ఆడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై సదరు టీడీపీ నాయకుడు ఒక వీడియోను విడుదల చేశారు. తాను ఆవేశంలో మాట్లాడాననీ, క్షమించాలంటూ కోరాడు.

సైబర్ నేరగాళ్ల ఆటకట్టు

ముంబై పోలీసులమంటూ బెదిరింపులు

వ్యక్తిని బెదిరించి రూ.33లక్షలు కాజేసిన వైనం

ఆరుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న, ఏఎస్పీ, డీఎస్పీ

ధర్మవరం, సెప్టెంబరు 19: ముంబై పోలీసులమంటూ ఓ వ్యక్తిని బెదిరించి రూ.33 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లను జిల్లా పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆరుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఏఎస్పీ ఏ శ్రీనివాసులు, ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులుతో కలిసి ఎస్పీ.. నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన వైద్యుడు సూర్యనారాయణరెడ్డికి గత నెల 18న సైబర్ నేరగాళ్లు ముంబై పోలీసుల లోగో ఉన్న నంబర్ నుంచి వ్యాట్సాప్ కాల్ చేశారు. తాము ముంబై పోలీసులమని నమ్మించారు. నరేశ్ గోయల్ అనే వ్యక్తి రూ.500 కోట్లు బ్యాంకు నుంచి అప్పు తీసుకుని, ఆ డబ్బును వేర్వేరు ఖాతాలకు జమ చేశాడన్నారు. 'నీ ఖాతాకు కూడా రూ.20 లక్షలు బదిలీ అయనట్లు నరేశ్ గోయల్ ఫేక్ ఆధార్‌కార్డు, బ్యాంకు స్టేట్‌మెంట్లను చూపించి, నమ్మించారు. దీనిపై కేసు నమోదైందన్నారు. దీని నుంచి బయటపడాలంటే రూ.33లక్షలు తమ అకౌంట్‌లోకి వేయాలన్నారు. లేదంటే కుటుంబసభ్యులను కూడా అరెస్టు చేసి ముంబైకి తీసుకెళ్తామని సూర్యనారాయణరెడ్డిని బెదిరించారు. దీంతో ఆందోళన చెందిన సూర్యనారాయణరెడ్డి గత నెల 20న పట్టణంలోని ఓ బ్యాంకు నుంచి రూ.20లక్షలను మంగమద్దల ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఉన్న అకౌంట్ నంబర్‌కి జమచేశాడు. మరో బ్యాంకు నుంచి రూ.13లక్షలు అదే ఖాతాకి పంపాడు. తరువాత సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గ్రహించి, పోలీసులను ఆశ్రయించాడు. ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు దీనిపై దృష్టి పెట్టారు. సైబర్ నేరగాళ్లు కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దాసిలియజెర్, నంద్యాల జిల్లా అయ్యలూరుకు చెందిన మంగమద్దల ప్రహల్లాద్, కడపజిల్లా శివానందపురానికి చెందిన నగలరావు స్వామిదాసు, నంద్యాలలోని వెంకటాచలం కాలనీకి చెందిన అల్లు అంబిరెడ్డి, ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన బెలగడ కిశోర్, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండల గూడిపల్లికి చెందిన జావీద్‌పై కేసు నమోదు చేసి, సైబర్ క్రైం పోలీసులకు పంపారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఏఆర్ పీసీలు కిరణ్‌కుమార్, మల్లికార్జున, వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ చలమారెడ్డి, శివశంకర్, అబ్దుల్లా, దివాకర్, రాజు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

పేదల కడుపు సల్లగా..

తెరుచుకున్న అన్న క్యాంటిన్లు

ధర్మవరం, పుట్టపర్తిలో ప్రారంభం

ధర్మవరం/పుట్టపర్తి, సెప్టెంబరు 19: నిరుపేదలకు ఆకలి బాధలు తప్పాయి. గత వైసీపీ ప్రభుత్వం మూసివేసిన అన్న క్యాంటీన్లు తెరుచుకున్నాయి. జిల్లాలోని ధర్మవరం, పుట్టపర్తిలో అన్న క్యాంటిన్లను ప్రారంభించారు. ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రి, ఎల్‌పీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన రెండు అన్న క్యాంటీన్లను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి పేదలకు భోజనం వడ్డించారు. స్థానికులతో కలిసి అక్కడే భోజనం చేశారు. మంత్రి మాట్లాడుతూ... గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆకలితో అలమటిస్తున్న పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలన్న సదుద్దేశంతో రూ.5కే అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేశారన్నారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక వైఎస్ జగన్.. పేదల నోట్లో మట్టికొట్టి అన్న క్యాంటిన్లను మూసేశాడన్నారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో రూ.5కే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి రుచికరమైన ఆహారం అందించాలని ప్రభుత్వ నిర్ణయించిందన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... అన్న క్యాంటిన్లు తిరిగి ఏర్పాటుచేయడంతో పేదల బతుకుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, కమతం కాటమయ్య, ఎల్ నరేంద్రచౌదరి, చింతలపల్లి మహేశ్ చౌదరి, పరిశేసుధాకర్, సందా రాఘవ, పణికుమార్, మద్దిలేటి, పురుషోత్తం గౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లి షరీఫ్ పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్, చిలకం

పుట్టపర్తిలో..

జిల్లాకేంద్రంలోని ఎనుమలపల్లి బస్టాండు వద్ద అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పునఃప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల కడుపు నింపే అన్న క్యాంటిన్లను గత వైసీపీ ప్రభుత్వం మూసేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటవడంతో క్యాంటిన్లను పునఃప్రారంభించి, పేదలకు అన్నం పెట్టడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నిరుపేదలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అన్న క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పాపం.. కూలీ..

దొంగ అనుకుని చితకబాదిన గ్రామస్థులు



కూలీని చితకబాదుతున్న జనం

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 19: దొంగ అనుకుని మహారాష్ట్రకు చెందిన ఓ కూలీని చితకబాదారు మండలంలోని చాకర్లపల్లి వాసులు. బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. మహారాష్ట్రలోని జలగాంకు చెందిన ఓ యువకుడు కూలి పని కోసం సోమందేపల్లికి బయలుదేరాడు. ట్రైన్‌లో కొంతమంది ఆకతాయిల వేధింపులకు ఇబ్బందిపడి చాకర్లపల్లి వద్ద రైలు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు వెంబడించాయి. దీంతో మేలుకున్న గ్రామస్థులు అతడిని దొంగగా భావించి తరిమారు. సాయిబాబా ఆలయ సమీపంలో అతడిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఏఎస్ఐ మురళి, సిబ్బంది విచారించగా అతడు పొట్టకూటికోసం వలస వచ్చిన కూలీ అని గుర్తించి, వదిలేశారు.

అన్నదాత బతుకు అంధకారం..!

నంబులపూలకుంట మండలంలోని దండేవారిపల్లికి చెందిన రైతు ఆంజనేయులు మూడెకరాల్లో వ్యవసాయం చేస్తుండేవాడు. పంటలు పండక నష్టపోయాడు. గ్రామస్థులంతా ఊరు వదిలి వలసెళ్లిపోసాగారు. అంజనేయులు కూడా గ్రామంలో ఉండలేక నంబులపూలకుంటకు వలస వచ్చాడు. యల్లమ్మ వీధిలో బాడుగ ఇంట్లో ఉంటున్నాడు. అప్పులు చేసి కాడెద్దులు, బండి కొనుగోలు చేశాడు. దానిని తిప్పుదామంటే బాడుగల్లేవు. రెండేళ్ల క్రితం బ్యాంకులో రూ.లక్ష, ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.3లక్షలు అప్పులు చేసి, నాలుగు పాడి ఆవులు కొనుగోలు చేశాడు. భార్య అంజినమ్మతో కలిసి వాటి ఆలనాపాలనా చూసుకుంటూ పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. ఒక కుమార్తె డిగ్రీ, మరో అమ్మాయి 8వ తరగతి చదువుతున్నారు. ఇటీవల అంజినమ్మ అనారోగ్యం బారినపడడంతో ప్రతినెలా మందులకు రూ.8వేలు ఖర్చవుతోందని రైతు వాపోయాడు. ఉన్న నాలుగు పాడి ఆవుల్లో రెండు పాడి ఆవులు పాలిస్తున్నాయి. మరో రెండు ఈత దశలో ఉన్నాయి. రానున్న రోజుల్లో పాల ఉత్పత్తి పెరిగి, కష్టాలు తీరుతాయని ఆశించిన ఆంజనేయులుకు నిరాశే మిగిలింది. బుధవారం ఆవులను మేతకు తీసుకెళ్లి, సాయంత్రం ఇంటికి తోలుకొచ్చాడు. రోజులాగానే గడ్డి వేశాడు. రాత్రి కడుపు ఉబ్బి మూడు ఆవులు గంటల వ్యవధిలో చనిపోయాయి. ఆ సమయంలో పశువైద్య వర్గాలకు సమాచారమిచ్చినా స్పందించేవారు. రాత్రంతా రైతు.. ఆవులను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డాడు. ఉదయం మరో ఆవు కూడా మృతిచెందింది. రైతుకు కన్నీళ్లు తప్ప.. ఏమీ మిగల్లేదు. ఇక.. ఎలా బతకాలని రోదిస్తున్నాడు. చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం చేస్తే.. ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకైనా దరఖాస్తు చేసుకోవచ్చని భావించాడు. పశువైద్యాధికారికి సమాచారం అందించాడు. తాను అందుబాటులో లేననీ, జిల్లాకేంద్రంలో ఉన్నానని పశువైద్యాధికారి చెప్పుకొచ్చారు. దీంతో చేసేదిలేక ఆవులను ఖననం చేశాడు రైతు. -నంబులపూలకుంట



ఆంజనేయులు

వంకాయలు తినడంతోనే..

వంకాయలు అధికంగా తినడం కారణంగానే ఆవులు మరణించాయి. బీమా చేసుకుని ఉందుంటే ప్రభుత్వం నుంచి పరిహారం దక్కేది.

- బాలానాయక్, పశువైద్యాధికారి, నంబులపూలకుంట



పాడి ఆవుల కళేబరాలు

అందమైన పల్లెటూరిలో..
ఆనందంగా పెరిగాడు..
సేద్యం తప్ప.. మరొకటి తెలీదు..
ఉన్న మూడెకరాల మెట్ట భూమిలో
పంటలు పెడుతుండేవాడు..
పల్లెలో బతుకుదెరువు కరువైంది..
ఒక్కొక్కరుగా ఊరు వదిలారు..
తాను కూడా ఉండలేక..
వలసొచ్చాడు..
అప్పులు చేసి.. ఎద్దులబండి కొన్నాడు..
బాడుగకు అడిగేవారు లేదు..
దానినీ అమ్మేశాడు..
అప్పులు చేసి.. ఆవులు కొన్నాడు..
పాలు అమ్ముకుని బతుకుదామనుకున్నాడు..
ఇంతలోనే భార్యకు అనారోగ్యం..
వైద్యానికి భారీగా ఖర్చు..
నెలనెలా మందులకు వేలల్లో పెచ్చించాలి..
ఇద్దరు కుమార్తెలు.. వారి చదువులు..
అన్నింటికీ పాడి ఆవులే ఆధారం..
ఇల్లు గడవడమే కష్టంగా ఉంది..
ఆ అన్నదాతను ఎక్కడికెళ్లినా..
దౌర్భాగ్యం వెంటాడుతూనే ఉంది..
అన్నంపెడుతున్న ఆవులు..
ఉన్నఫలంగా తెల్లారేలోపే
చనిపోయాయి..
ఈ పూట గడిచేదెలా..?
రేపు బతికేదెలా?
అన్నిదారులూ మూసుకుపోయాయి..
అంధకారం అలుముకుంది..
నంబులపూలకుంటకు చెందిన
రైతు ఆంజనేయులు దుస్థితి..
కన్నీళ్లకే కన్నీళ్లు తెప్పించే
జీవన పోరాటం ఆ నిర్భాగ్యుడిది..
అలాంటి వారిపై కూడా..
యంత్రాంగానికి కనికరం లేదు..
ఆవుల పరిస్థితి విషమంగా ఉందనీ..
రావాలని వేడుకున్నా..
వచ్చే వైద్యాధికారి లేడు..
సంచార పశువైద్య వాహనమూ లేదు..
అన్నదాత రోదన..
అరణ్యరోదన అయింది..
కనీసం చనిపోయిన ఆవులకు
పోస్టుమార్టం చేసేందుకు కూడా
అధికారులకు చేతులు రాలేదు..
పరిహారం అందేలా చేసి..
రైతు కన్నీళ్లు తుడుద్దామన్న
కనికరం కూడా పుట్టలేదు..
ఇదీ.. యంత్రాంగం తీరు..
వారు వెలగబెడుతున్న ప్రజాసేవ..



అక్కినేనితో అనంత బంధం

జ్ఞాపకాలు

- 1972లో తొలిసారి నగరానికి రాక
- 1994లో మాజీ రాష్ట్రపతి నీలం చేతుల మీదుగా సత్కారం
- నేడు అక్కినేని 101వ జయంతి


నాగరాజుకు తన ఆటోగ్రాఫ్‌తో అక్కినేని అందించిన ఫొటో

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 19: ఎవర్ గ్రీన్ హీరో అక్కినేని నాగేశ్వరరావుకు నిండు నూరేళ్లు..! ఆయన 101వ జయంతి వేడుకలను శుక్రవారం అభిమానులు నిర్వహించుకోనున్నారు. ఆయన భౌతికంగా దూరమైనా, అభిమానుల గుండెల్లో పదిలంగా ఉన్నారు. అనంతపురంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. 1972 నవంబరు 24న త్యాగరాజ సంగీత సభ ఆధ్వర్యంలో నగరంలోని రఘువీర థియేటర్‌లో భారతరత్న పండిట్ రవిశంకర్ సితార్ కచేరి జరిగింది. అక్కినేని నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్పట్లో హొస్పేటలో భక్తతుకారం షూటింగ్ జరుగుతోంది. బిజీ షెడ్యూల్ ఉన్నా.. ఆయన అనంతపురానికి వచ్చారు. ఆ తర్వాత 1994లో మరోసారి అనంతపురం నగరానికి వచ్చారు. శాంతి థియేటర్ నుంచి లలితకళా పరిషత్ వరకు వరకు ఆయనను అభిమానులు ఊరేగించారు. పోలీస్ కాంప్లెక్స్ అతిథి భవనంలో ఆ రోజు ఏఎన్నార్ బస చేశారు. ఆ రోజు సాయంత్రం లలితకళా పరిషత్‌లో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి అక్కినేనిని ఘనంగా సన్మానించారు. అదే సమయంలో అభిమానులు ఆయనకు ఉంగరాన్ని బహూకరించారు. మరణం చేరువవుతోందని తెలిసినా.. ఆయన నటనను వీడలేదు. 'మనం' సినిమాలో కుటుంబ సభ్యులతో కలిసి నటించారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని, క్యాన్సర్‌తో పోరాడి.. పరిపూర్ణ జీవితాన్ని అనుభవించిన అక్కినేని జీవితం స్ఫూర్తిదాయకం.

22న అక్కినేని స్వరాభిషేకం

అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకుని అనంతపురం అక్కినేని అభిమానుల ఆధ్వర్యంలో ఈ నెల 22న అక్కినేని స్వరాభిషేకం నిర్వహించనున్నారు. నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం సాయంత్రం జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల కళాకారులు, గాయకులు పాల్గొంటున్నారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన సినిమాల్లోని పాటలతో ఆయనకు స్వరనీరాజనం పలకనున్నారు.

గుర్తు పట్టి పలకరించేవారు..



తనను అభిమానించే ప్రతి ఒక్కరినీ ఏఎన్నార్ గుర్తు పట్టి మరీ పలుకరించేవారు. 1994లో అనంతపురం వచ్చిన అక్కినేని నాగేశ్వరరావుకు మేము ఉంగరాన్ని బహూకరించాము. ఆ తర్వాత ఎపుడైనా హైదరాబాద్ వెళితే ఆయనను కలిసేవాళ్లం. మమ్మల్ని గుర్తు పట్టి పేర్లతో పలకరించేవారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకునేవారు. మేము ఎప్పుడు కలిసినా ఆయన చేతి వేలికి మేము బహూకరించిన ఉంగరం ఉండేది. అంతగా అభిమానులను గౌరవించేవారు. ఆటోగ్రాఫ్‌తో కూడిన తన ఫొటోను మాకు ఇచ్చారు.

-నాగరాజు, అక్కినేని అభిమాని

అనంత గురించి అడిగారు..



అక్కినేని నాగేశ్వరరావు రచయితలను ఎంతగానో గౌరవించేవారు. 1972లో త్యాగరాజ సంగీత సభ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను రచయితలం అందరం కలిసి సన్మానించాము. 2010 సెప్టెంబరు 20న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ఆయన జన్మదిన వేడుకలకు మమ్మల్ని ఆహ్వానించారు. అపుడు వెళ్లి నాగేశ్వరరావును కలిసి మాట్లాడించాము. మీ అనంతపురం జిల్లా ఎలా ఉంది? అని అడిగారు. ఆ క్షణాన్ని ఎన్నటికీ మరువలేను.

-కంబదూరి నబీరసూల్, కవి

నేడు సీతారాం ఏచూరి సంతాప సభ

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 19: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభను శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని లలితకళాపరిషత్‌లో నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సభకు టీడీపీ ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తోపాటు పలువురు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు.

ముగిసిన ఎంబీబీఎస్ తొలివిడత జాయినింగ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 19: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో అనంత కళాశాలలో 138 మంది మెడికోలు రిపోర్ట్ చేసుకున్నారు. గురువారం తొలివిడత రిపోర్ట్ ప్రక్రియ ముగియగా 128 మంది రాష్ట్రకోటాలో సీట్లుపొందిన మెడికోలు రిపోర్ట్ చేసుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. జాతీయకోటాలో 21 సీట్లకుగాను 10 మంది జాయిన్ అయ్యారన్నారు.

జీడిపల్లికి 915 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 19: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 915 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 886 క్యూసెక్కుల నీరు వెళుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో నీటి నిల్వ 1.674 టీఎంసీలు ఉందని అధికారులు వెల్లడించారు.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 19: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు శుక్రవారం నిర్వహించనున్నారు. జడ్పీలోని ప్రధాన సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ స్టాండింగ్ కమిటీ, వర్క్స్ స్టాండింగ్ కమిటీ, గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు. జడ్పీ అదనపు సమావేశ మందిరంలో అదే సమయానికి విద్య-వైద్యం స్టాండింగ్ కమిటీ, మహిళా-శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ, వ్యవసాయం స్టాండింగ్ కమిటీ, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు.

6 నుంచి టీటీసీ పరీక్షలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 19: టీటీసీ థియరీ పరీక్షలు-2024 వచ్చేనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఈఓ వరలక్ష్మి, పరీక్షల విభాగ సహాయ కమిషనర్ గోవింద్ నాయక్ గురువారం ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, అదేవిధంగా 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు మూడు విడతలుగా పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

బెంగళూరు-ధర్మవరం రైలు స్టాపింగ్ తొలగింపు

గుంతకల్లు, సెప్టెంబరు 19: బెంగళూరు-ధర్మవరం మధ్య నడుస్తున్న డెము రైలు (నెం. 06595/96) బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో స్టాపింగ్‌ను తొలగించినట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ రైలును సెప్టెంబరు 20 నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు 92 రోజులపాటు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో నిలపకుండా పంపనున్నట్లు తెలియజేశారు.

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

గుత్తి, సెప్టెంబరు 19: సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను రైల్వే పోలీసులు గురువారం పట్టుకున్నారు. ధర్మవరానికి చెందిన ఖాదర్‌బాషా బీటెక్ చదివాడు. మరో యువకుడితో సైబర్ నేరాలకు పాల్పడుతూ జల్సాల కు అలవాటు పడ్డారు. సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా రైల్వే పోలీసులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద వారిని పట్టుకుని అనంతపురానికి తరలించినట్లు సమాచారం.

విషజ్వరంతో మహిళ మృతి

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 19: కెంచానపల్లి గ్రామానికి చెందిన జ్యోతి (33) విషజ్వరంతో గురువారం మృతి చెందిందివ. మూడురోజుల నుంచి జ్వరంతో బాధపడుతూ ఉండేదని, బుధవారం జ్వరం ఎక్కువ కావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.




ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, హాజరైన అధికారులు

అన్ని చెరువులకూ నీరు

- మొహమాటం లేదు.. దామాషా ప్రకారం వాటా
- హెచ్చెల్సీ వాటాలో 16.368 టీఎంసీలు తాగునీటికి..
- సాగుకు 10 టీఎంసీల కేటాయింపు
- శింగనమల చెరువుకు ముందుగానే నీరు
- ఐఏబీ సమావేశంలో మంత్రులు కేశవ్, సత్యకుమార్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19: ఉమ్మడి జిల్లాలోని ప్రతి చెరువునూ నింపడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శింగనమల చెరువుకు షెడ్యూలు తేదీలకంటే ముందుగానే నీటి విడుదల చేయాలని జలవనరుల శాఖ ఇంజనీర్లకు సూచించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కాలవ పటిష్టతను పరిశీలించాలని సూచించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలని, ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు సమాచారం అందించి, పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గడిచిన ఐదేళ్ల రైతులు నిర్లక్ష్యానికి గురయ్యారని, వారి సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. అన్నంపెట్టే రైతులతో పాటు అన్ని వర్గాలకు మేలు చేయడమే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నీటి ప్రాధాన్యంపై రైతులు, ప్రజలలో అవగాహన పెంచాలని, హెచ్చెల్సీ నీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొహమాటాలు, నిర్లక్ష్యం వద్దని, దామాషా ప్రకారం అన్ని ప్రాంతాలకు నీటి పంపిణీ చేయాలని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయిన సమయంలో సీఎం చంద్రబాబు వేగంగా స్పందించారని అన్నారు. నీటి వృథాను అరికట్టాలని తనను, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అధికారులను అప్రమత్తం చేశారని కేశవ్ అన్నారు. ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో స్టాప్‌లాగ్ ఏర్పాటు చేసి, నీటి వృథాను అరికట్టారని అన్నారు. సీఎం చంద్రబాబు, కన్నయ్య నాయుడు సహా ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది, ప్రభుత్వాన్ని అభినందిస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశం అనంతరం మంత్రులు కేశవ్, సత్యకుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. తుంగభద్ర జలాశయం నుంచి 26.368 టీఎంసీల నీటిని హెచ్చెల్సీ వాటాగా కేటాయించారని, అందులో సాగుకు 16.368 టీఎంసీలు, తాగునీటికి 10 టీఎంసీలు కేటాయించామని తెలిపారు. కాలువలకు నీటిని విడుదల చేసే తేదీలను నిర్ణయించి, రైతులకు మేలు చేసే బాధ్యతను ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా నిర్వర్తించేలా నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కరువు జిల్లా రైతాంగానికి సాగునీరు అందించే విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టకుండా 2025 వరకు నిషేధం విధిస్తూ 2020 జూలైలో జీవో 365ను విడుదల చేశారని, రైతాంగం పట్ల ఆ ప్రభుత్వానికి ఏ పాటి చిత్తశుద్ధి ఉందో దీన్ని బట్టే అర్థమవుతోందని అన్నారు.

సకాలంలో సాగుకు నీరివ్వాలి..



టీబీ డ్యాం నుంచి సకాలంలో నీటిని విడుదల చేయడంతో రాయదుర్గంలోని రైతులు పంటలు సాగు చేశారు. ఓ వైపు నీటి విడుదల, మరోవైపు వర్షాలు రావడంతో పరిస్థితి సానుకూలంగా ఉంది. హెచ్చెల్సీ పూడికతీత పనులు చేపట్టాలి. ఐదేళ్లుగా హెచ్చెల్సీని నిర్వీర్యం చేశారు. ఆయకట్టు రైతుల ద్వారా కట్టిన పన్నులకు అనుగుణంగా కాడా నుంచి నిర్వహణకు అవసరమైన నిధులను రాబట్టాలి.

- కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే


లస్కర్లను నియమించాలి..



నీటి అనంతరం వృథా కాకుండా, చౌర్యం జరగకుండా లస్కర్లను నియమించి నీటిని కాపాడాలి. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి పిచ్చిమొక్కలను తొలగించాలి. తెగిన కాలువలకు మరమ్మతులు చేయాలి. గత ఐదేళ్లల్లో జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కాలువల నిర్వహణను గాలి కొదిలేశారు. తాడిపత్రి నియోజకవర్గంలోని సుబ్బరాయసాగర్, ముచ్చుకోటలతోపాటు చెరువులను నీటితో నింపాలి. ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- జేసీ అశ్మిత్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం రైతులను ఆదుకోవాలి



జిల్లాలోనే అత్యంత వెనుకబడిన కళ్యాణదుర్గం ప్రాంతంలోని రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలి. కళ్యాణదుర్గానికి హెచ్చెల్సీ నుంచి తుంగభద్ర జలాలు, హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు ఇవ్వాలి. జీడిపల్లి నుంచి బీటీపీకి నీటిని తీసుకెళ్లే కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలి. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పూర్తి చేయడానికి ప్రభుత్వం తరఫున కలెక్టర్ బాధ్యత తీసుకుని చొరవ చూపాలి.

- అమిలినేని సురేంద్రబాబు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే

గుంతకల్లు నియోజకవర్గంపై దృష్టిపెట్టాలి



గుంతకల్లు నియోజకవర్గానికి అటు హెచ్చెల్సీ ద్వారా తుంగభద్ర జలాలు, ఇటు హంద్రీనీవా ద్వారా కృష్ణా నీటిని అందించాలి. గుంతకల్లు నియోజకవర్గం మీదుగా రెండు కాలువలు వెళ్తాయి. నియోజకవర్గానికి హెచ్చెల్సీ, హంద్రీనీవా ద్వారా నీటి కేటాయింపులు పెరగాలి. జీబీసీ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి.

- గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఎమ్మెల్యే

అధికారులు ఉదాసీనత వీడాలి..



రైతుల కష్ట, నష్టాలపై అధికారులు ఉదాసీనత వీడాలి. అన్నదాతలతోపాటు అన్ని వర్గాల యోగక్షేమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది. వర్షాలు కురుస్తున్న సమయంలోనూ రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధాకరం. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఉమ్మడి జిల్లా ప్రజలకు వర్తింపచేసి సద్వినియోగం చేసుకునేలా బాధ్యత తీసుకుంటా. వరదలతో టీబీ డ్యాం గేట్ కొట్టుకుపోయిన సమయంలో సీఎం చంద్రబాబు, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పందించిన తీరు అభినందనీయం. జలరంగ నిపుణులు కన్నయ్యనాయుడు తన అనుభవంతో డ్యాంలో నీటిని వృథా కాకుండా ప్రవాహంలోనే గేటును అమర్చడంతో కొత్త అధ్యయనానికి నాంది పలికారు.

- సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి

ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి



జలవనరులశాఖ ఇంజనీర్లు కాలవల మీద క్షేత్రస్థాయిలో పర్యటించాలి. అప్పుడే నీటి వృథా, చౌర్యాన్ని అరికట్టవచ్చు. సమస్యలను సైతం తెలుసుకోవచ్చు. వివిధ ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని నీటిని పరిరక్షించుకోవాలి. కర్ణాటక ప్రాంతంలో అధికంగా వర్షాలు కురవడంతో టీబీ డ్యాంకు 170 టీఎంసీల నీటి నిల్వను అంచనా వేయగా, హెచ్చెల్సీకి 26.368టీఎంసీల నీరు కేటాయించారు.

-వినోద్‌కుమార్, కలెక్టర్, ఐఏబీ చైర్మన్

వెంటనే నీటిని విడుదల చేయండి



ఐదేళ్లుగా వివక్షకు గురైన శింగనమల నియోజకవర్గ రైతులు, ప్రజలకు సాగు, తాగునీరు అందించి ఆదుకోవాలి. నియోజకవర్గంలో డ్యాంలు, పెద్ద చెరువులు ఉన్నప్పటికీ నీరు అందడం లేదు. నియోజకవర్గానికి 10టీఎంసీల నీరు కేటాయించాలి. అక్టోబరు వరకు కాకుండా వెంటనే నీటిని విడుదల చేసి ప్రజలు, రైతులను ఆదుకోవాలి. సాగు చేసిన పంటలు నీరు అందక ఎండి పోతున్నాయి. ఆన్‌అండ్ ఆఫ్ పద్ధతిలో కాకుండా రెగ్యులర్‌గా నీటిని సరఫరా చేయాలి.

- బండారు శ్రావణి శ్రీ, శింగనమల ఎమ్మెల్యే

నగరంలో నీటి వినియోగం పెరిగింది




జనాభా పెరగడంతో నగరంలో నీటి వినియోగం పెరిగింది. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులు, చెరువులను నీటితో నింపాలి. నేషనల్ పార్కు వద్ద ఉన్న చెక్‌డ్యాంకు నీటి పంపిణీ జరగాలి. తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

-దగ్గుపాటి ప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

నీటి విడుదల తేదీల ప్రకటన

టీబీ డ్యాం నుంచి వచ్చే నీటి విడుదల తేదీలను హెచ్చెల్సీ ఎస్‌ఈ, ఐఏబీ కన్వీనర్ రాజశేఖర్ ప్రకటించారు. టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి జూలై 22వ తేదీన విడుదల చేశారు. పీఏబీఆర్‌కు జూలై 28వ తేదీన చేరాయి. ఎంపీఆర్‌కు జూలై 30వతేదీన నీటిని విడుదల చేశారు. హెచ్ఎల్ఎంసీకి ఆగస్టు 10వతేదీన, జీబీసీకి ఆగస్టు 10వతేదీన నీటిని విడుదల చేశారు. ఎంపీఆర్ సౌత్, నార్త్‌కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు ఈ వారంలోనే నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

చివరి ఆయకట్టు వరకు నీటి పంపిణీ జరగాలి..



చివరి ఆయకట్టు వరకు నీటి పంపిణీ జరగాలి. అప్పుడే రైతుల సమస్యలు తీరుతాయి. హెచ్చెల్సీ నీరు తక్కువగా ఉన్న చోట హంద్రీనీవా నీటిని అందించాలి. గత రెండుమూడేళ్లుగా రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలవ ఆధునికీకరణలో సైడ్‌వాల్స్‌లో మాత్రమే సిమెంట్ కాంక్రీట్ వేయాలి. అడుగు భాగాన కాంక్రీట్ వేయకుండా ఉంటేనే బోర్ల రీచార్జి జరుగుతుంది. పీఏబీఆర్ పూర్తి స్థాయి నీటి నిల్వకు అవసరమైన పెండింగ్‌లో ఉన్న భూసేకరణ చేయాలి.

- శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాంతాలకూ నీరందించాలి



ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలి. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, జలవనరులశాఖ అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ నిర్ణయాలకు పూర్తి సహకారం అందిస్తాం. కరవు జిల్లాను అభివృద్ధి చేయడంతో ముందుంటాం.

- బోయ గిరిజమ్మ, జడ్పీ చైర్‌పర్సన్

రావత్ సెంచరీ

- చేరువలో సంజు శ్యాంసన్
- దులీప్ ట్రోఫీ చివరి పోటీలు ప్రారంభం


రావత్ సెంచరీ అభివాదం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19: దులీప్ ట్రోఫీలో భాగంగా అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్ ఏ స్టేడియంలో గురువారం ఇండియా-ఎ, సి జట్ల మధ్య ఆట ప్రారంభమైంది. తొలిరోజు ఎ-జట్టు ఆటగాడు శషావత్ రావత్ సెంచరీ సాధించాడు. టాస్‌గెలిచిన ఇండియా సి జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేపట్టిన ఇండియా-ఎ జట్టులో ఓపెనర్లు ప్రథమ్‌సింగ్ (6), మయాంక్ అగర్వాల్ (6), తిలక్‌వర్మ(5), రియాన్ పరాగ్ (2), కుమార్ కుషర్గ (0) విఫలమయ్యారు. ఆ తరువాత షాంశ్ ములనీ 44, తనుష్ కొటియాన్ 10 పరుగులు చేశారు. శాషావత్ రావత్ 235 బంతుల్లో 15 బౌండరీలతో 122 పరుగులు, ఆవేష్‌ఖాన్ 16 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-ఎ జట్టు 77 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 224 పరుగులు సాధించింది. ఇండియా-సి బౌలర్లలో అన్షుల్ కాంబోజ్ 3 వికెట్లు, వైశాక్ విజయ్‌కుమార్ 2, గౌరవ్‌యాదవ్ ఒక వికెట్ తీసుకున్నారు.

సెంచరీకి చేరువలో సంజు

అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్ బీలో ఇండియా-బీ, డి జట్ల మధ్య పోటీ సాగింది. ఈ మ్యాచ్‌లో సంజు శ్యాంసన్ సెంచరీకి చేరువయ్యారు. బి జట్టు టాస్‌గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసి ఇండియా-డి జట్టులో ఓపెనర్లు దేవదత్తు పడిక్కిల్ 50 పరుగులు, కేఎస్ భరత్ 52 పరుగులతో 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం వచ్చిన రికీభుయ్ 56 పరుగులు, నిషాంత్ సింధు 19 పరుగులు చేశారు. శ్రేయాస్ అయ్యర్ మరోసారి డకౌట్ అయ్యాడు. సంజు శ్యాంసన్ 89 పరుగులు, శరాన్ష్‌జైన్ 22 పరుగులతో క్రీజులో ఉన్నారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-డి జట్టు 77 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. ఇండియా-బి బౌలర్లు రాహుల్ చాహర్ 3 వికెట్లు, నవదీప్ సైనీ, ముకేష్‌కుమార్ చెరో వికెట్ తీశారు.


సంజూ శాంసన్ (89 బ్యాటింగ్)

కియ సంస్థ భారీ వితరణ

- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రూ.5 కోట్ల విలువ చేసే వైద్య పరికరాల అందజేత

అనంతపురం టౌన్, సెప్టెంబరు 19: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కియాపరిశ్రమ సంస్థ యాజమాన్యం రూ.5 కోట్లు విలువ చేసే వైద్యపరికరాలు అందజేశారు. రూ.2.50 కోట్లు విలువ చేసే ఐవీయూఎస్, ఎఫ్ఎఫ్ఆర్ యంత్రంతోపాటు రూ. 2.50కోట్లు విలువచేసే స్టంట్స్, కాథిలాక్స్, అనుబంధ వైద్యచికిత్స పరికరాలు వితరణ చేశారు. గురువారం వైద్యశాఖామంత్రి సత్యకుమార్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ సమక్షంలో కియాపరిశ్రమ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా కియ సంస్థ ప్రతినిధులను మంత్రి, ఎమ్మెల్యే, వైద్యాధికారులు సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. ఇటీవల కాలంలో గుండె సమస్యలు అధికమయ్యాయని, ఇందుకోసం ప్రతి సీహెచ్‌సీలో 45వేల ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. క్యాన్సర్ నివారణ, చికిత్స కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కియ సంస్థ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భారీస్థాయిలో వైద్యపరికరాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఇదేస్ఫూర్తిని ఇతర కార్పొరేట్ సంస్థలు కొనసాగించి విరాళాలు ఇవ్వడానికి ముందుకురావాలని అలాంటి వారికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామని, డాక్టర్లు మరింత బాధ్యతగా పనిచేయాలని సత్యకుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కార్డియాలజీ వైద్యులు డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు


వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ఓబీసీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


సమావేశంలో పాల్గొన్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19: ఆర్థికంగా, విద్య, సామాజిక రంగాల్లో ఓబీసీలు అభివృద్ధి చెందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలని అనంతపురం ఎంపీ, ఓబీసీ కమిటీ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కోరారు. గురువారం న్యూఢిల్లీ పార్లమెంట్ అన్నెక్స్ భవనంలో నిర్వహించిన ఓబీసీ కమిటీ సమావేశంలో అంబికా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గుర్తింపు కలిగిన ఓబీసీ యువతకు ఉద్యోగ, విద్యా రంగాల్లో పూర్తిస్థాయిలో రిజర్వేషన్లు అమలు చేయడంతోపాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీ, విద్యార్థులు

సైబర్ నేరాల కట్టడికి అవగాహన ర్యాలీ

ధర్మవరం, సెప్టెంబరు 19 : ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని నగరంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ రత్న ఆధ్వర్యంలో స్థానిక కాలేజ్ సర్కిల్ నుంచి షిర్డీసాయిబాబా కల్యాణ మండపం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ఏఎస్పీ ఏ శ్రీనివాసులు, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అక్కడ సైబర్ నేరాలపై స్క్రీన్‌పై చూపిస్తూ ఎస్పీ అవగాహన కల్పించారు. బ్యాంకు వివరాలు, సెల్‌కు వచ్చే ఓటీపీని ఎవరికీ షేర్ చేయరాదన్నారు. వీడియో కాల్స్ చేసి న్యూడ్ ఫొటోలు తీయడం, తరువాత బ్లాక్‌మెయిల్ చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఈ సదస్సులో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, రామగిరి సీఐ శ్రీధర్, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి, ఎస్టీ ఎస్ఐప్రదీప్‌కుమార్, సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సొమ్ము స్వాహాపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంబులపూలకుంట, సెప్టెంబరు 19: మండలంలోని ధనియాన్‌చెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనుల్లో అవినీతి జరిగింది. అంతేకాకుండా పాఠశాలకు దాతలిచ్చిన స్థలం కూడా ఆక్రమణకు గురైంది. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన కదిరి ఆర్డీవో వంశీకృష్ణ ఆ పాఠశాలను తనిఖీ చేశారు. నాడు-నేడు పనుల రికార్డులను పరిశీలించారు. పాఠశాల స్థలాన్ని ఎవరు ఆక్రమించారో పూర్తిగా ఆధారాలు అందించాలని తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు సూచించారు. నాడు నేడులో ఖర్చు చేసిన రూ.30లక్షల నిధులు బిల్లులను అందించాలని, పాఠశాలలోని నల్లబండలు, కట్టెలు, ముఖద్వారం గేట్ ఎంతకు విక్రయించారు... వాటిని ఎక్కడ ఖర్చు పెట్టారన్న విషయాలు రాసి ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులు బోగాదిరెడ్డికి సూచించారు. నల్లబండ కొనుగోలు చేసిన ఒక వ్యక్తిని పిలిపించి అడుగగా, ఒక్కటి రూ.250 వంతున కొనుగోలు చేశామని, గతంలోనే డబ్బులు చెల్లించామని అన్నారు. నాడు-నేడు నిధుల చెక్కులపై సంతకాల చేసిన సభ్యులను కొంతమంది వద్ద ఆరాతీశారు. ఆయన వెంట ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, మండల ఇంజనీర్ వరప్రసాద్, సచివాలయ ఇంజనీర్ పృధ్వీ ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ

విద్యుత్ సమస్యలపై రైతుల ఆందోళన

గాండ్లపెంట, సెప్టెంబరు 19: మండలంలోని మద్దివారిగొంది రైతులు విద్యుత్ సమస్యపై కోటపల్లి గ్రామ సమీపంలో గురువారం ఆందోళన చేపట్టారు. మద్దివారిగొంది, కోటపల్లి, కమతంపల్లి తదితర గ్రామాలకు కదిరిలోని కుమ్మర వాండ్లపల్లి సబ్‌స్టేషన్ నుంచి రైతులకు విద్యుత్ సరఫరా అందచేస్తున్నారు. ఆ గ్రామాల రైతులకు గాండ్లపెంట నుంచి విద్యుత్ సరఫరా అందించడానికి విద్యుత్ అధికారులు రాగా, రైతులు వారిని అడ్డుకున్నారు. తమకు కుమ్మరవాండ్లపల్లి నుంచే విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. గాండ్లపెంట నుంచి సరఫరా చేస్తే లోవోల్టేజీ సమస్య వస్తుందన్నారు. పంటలు ఎండిపోవడంతో పాటు మోటార్లు కాలిపోతాయని వాపోయారు. ఈ విషయంపై డీఈ మోజెస్, ఏడీ సుబ్రమణ్యం, ఏఈ గౌరీ శంకర్ రైతులకు నచ్చచెప్పడానికి యత్నించారు. రైతులు తమకు కదిరి కుమ్మరవాండ్లపల్లి నుంచే విద్యుత్ సరఫరా చేయాలని పట్టుబట్టారు. అధికారులు అందుకు ఒప్పుకొని.. వెనుదిరిగారు.



రైతులతో చర్చిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

తప్పిపోయాడా.. వదిలించుకున్నారా..!

● అందరూ ఉన్నా అనాథగా...

నిమ్మనపల్లి, సెప్టెంబరు 19: అతడికి అందరూ ఉన్నా అనాథగా మారాడు. అతను తప్పిపోయాడా.. నా అనుకున్న వారే వదులుకున్నారా అనే అనుమానం కలుగుతోంది. నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి వెంకోజి గారిపల్లెలో బుధవారం రాత్రి ఓ వృద్ధుడు నడవలేని పరిస్థితిలో కనిపించాడు. అయితే రాత్రి స్థానికులు అన్నం పెట్టి ఉదయాన్నే రోడ్డు పక్కన వదిలేశారు. దీంతో అక్కడ ఉన్న వారు గమనించి అతడిని ఓ ఇంటి వద్ద వదిలిపెట్టారు. అతడి గురించి ఆరా తీయగా తన పేరు ఒలిపి రామయ్య అని తనది శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం చెంద్రాయునిపల్లె అని తెలిపాడు. కాగా తాను తిరుమల కొండకు గ్రామస్థులతో కలసి వెళ్లగా వారు తాను నడవలేనని తిరుమలలోనే వదిలి వెళ్లారని తెలిపాడు. తనకు ముగ్గురు కుమారులు వెంకటప్ప, రమణ, లక్ష్మణలు ఉన్నారని, తన భార్య 9 ఏళ్ల క్రితం మరణించినట్లు తెలిపాడు. ముగ్గురు కుమారులకు పెళ్లిళ్లు కూడా చేశానని తెలిపాడు. చాలా ఏళ్ల నుంచి తాను తిరుమలలోని కోమటివానిపత్రంలో రూ.5 వేలకు వాచ్‌మన్‌గా పనిచేస్తుండేవాడినని, తన నడిపి కుమారుడైన లక్ష్మణ తిరుమలకు వచ్చి తనను బాగా చూసుకుంటామని మాయమాటలు చెప్పి తాను దాచుకొన్న రూ.70 వేలను తీసుకొని స్వగ్రామానికి తీసుకొచ్చినట్లు తెలిపాడు. అప్పటి నుంచి రోజుకు ఒక పూట మాత్రమే అన్నం పెట్టేవారని ఆవేదన చెందాడు. తనకు వృద్ధాప్య పింఛన్ వస్తుందని దానిని కూడా తన వేలిముద్ర వేసుకుని తన కొడుకులే తీసుకొనే వారని భోరున విలపించాడు. ప్రస్తుతం తాను ఎక్కడికి పోవాలో తెలియడం లేదని, ముగ్గురు కొడుకులు ఉండి కూడా ఏం లాభం అని వాపోయాడు. కని సాకి పెద్ద చేసిన తన కన్నబిడ్డలే తండ్రినే ఈరోజు రోడ్డున పడవేశారని ఆవేదన చెందాడు. ప్రస్తుతం రామయ్య నిమ్మనపల్లెలోని ఓ ఇంటి వద్ద తలదాచుకుంటున్నాడు.



నడవలేని స్థితిలో ఉన్న రామయ్య

బ్లూమూన్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

కదిరి అర్బన్: స్థానిక బ్లూమూన్ కళాశాలతో గురువారం ఘనంగా ఫ్రెషర్స్‌డే నిర్వహించారు మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండో సంవత్సరం విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమలు ఆకట్టుకున్నాయి. క్రీడాపోటీల్లో విజేత జట్టుకు ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు నీరు కలుషితం

- కాలుష్య కోరల్లో 'బుక్కపట్నం'
- మూడు మండలాలకు ఇవే సాగు, తాగు నీరు
- పుట్టపర్తిలోని మురుగు నీరు చేరిక
- చేపలు మృతి
- ఆ నీరు తాగిన ప్రజలకు వ్యాధులు
- సాగుకూ పనికిరాని వైనం



బుక్కపట్నం చెరువులోకి కలుస్తున్న మురుగునీరు



నీలిరంగులో ఉన్న బుక్కపట్నం చెరువు నీరు

కొత్తచెరువు, సెప్టెంబరు 19 : బుక్కపట్నం చెరువ కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. చిత్రావతి నదిపైన అక్కరాయులు, బుక్క రాయులు మూడు మండలాల మధ్యలో ఈ చెరువును శతాబ్దాల క్రితం నిర్మించారు. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలకు ఈ చెరువే సాగు-తాగు నీటిని అందిస్తోంది. ఈ చెరువు ఆయకట్టు ప్రత్యక్షంగా 3250 ఎకరాలకు, పరోక్షంగా మరో మూడు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. రాష్ట్రంలోనే ఇది రెండో పెద్ద చెరువు. ఈ చెరువు విస్తీర్ణం 2,020 ఎకరాలు... అర్ధ టీఎంసీ సామర్థ్యం కలిగి ఉంది. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ చెరువులోని నీరు కలుషితం అవుతోంది. పుట్టపర్తి పట్టణంలోని మురుగు కాలువల్లోని నీరంత బీడిపల్లి వంక ద్వారా కొయ్యులగుట్లపల్లి వద్ద చెరువులోకి చేరుతోంది. దీంతో చెరువులోని నీరంతా కలుషితమై.. దుర్వాసన వస్తోంది. అదే నీటిని మూడ మండలా ప్రజలకు తాగునీటిగా సరఫరా చేస్తున్నారు. దీంతో ఆ నీటిని తాగిన ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారు. చర్మవ్యాధులు సోకుతున్నాయి. అంతేకాకుండా నీరు కలుషితం కావడంతో ఆ చెరువులోని చేపలన్నీ చనిపోతున్నాయి. దీంతో చేపల పెంపకందారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఇక ఆ నీరు సాగుకూ పనికి రావడం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. కనీసం ఆ మురుగునీటిని శుద్ధి కూడా చేయకుండా.. చెరువులోకి వదిలేస్తున్నారు. రాను.. రాను.. చెరువులో నీరు నీలి రంగులోకి మారుతోంది. దీనిపై డీఈ, ఇరిగేషన్ గంగాధర్‌ను వివరణ కోరగా... చిత్రావత నది ద్వారా బుక్కపట్నం చెరువులోకి మూడు ప్రాంతాల్లో మురుగు నీరు కలుస్తోందని, దీని నివారణ కోసం చిన్నంపల్లి వద్ద రూ.2.5 కోట్లతో పైపులైన్ ఏర్పాటు చేశామని అన్నారు. కొయ్యులగుట్లపల్లి వద్ద బీడిపల్లి వంక ద్వారా మురుగునీరు కలవకుండా త్వరలోనే చర్యలు తీసుకుంటామని వివరించారు.

వరద బాధితులకు అండగా...

కదిరి (అమడగూరు), సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడం కోసం అమడగూరులోని చౌడేశ్వరీ ఇంగ్లీషు మీడియం పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు గురువారం విరాళాలు సేకరించారు. ఇంటింటికి తిరుగుతూ మొత్తం రూ. 9,500 సేకరించామని, దాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించామని కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

అమడగూరులో విరాళాలు సేకరిస్తున్న చిన్నారులు



నల్లమాడ, సెప్టెంబరు 19 : విజయవాడ వరద బాధులకు పంపిణీ చేయడానికి బియ్యం ప్యాకెట్లు సిద్ధం చేశామని టీడీపీ కన్వీనర్ షైలే శివశంకర గురువారం తెలిపారు. మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు వీటిని సేకరించారని, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధితులకు వీటిని పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక మంలో సలాం ఖాన్, మహమ్మద్‌రఫీ, మంజు నాథ్‌రెడ్డి, అబ్బాస్ ఖాన్, బాబావలీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు..

కదిరి అర్బన్: విజయవాడ వరద బాధితుల కోసం కదిరి మండలంలోని కుమ్మర వాండపల్లి సెక్టారు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు దుస్తులు, బియ్యం సేకరించారు. గురువారం వాటిని అంగన్‌వాడీ నాయకురాలు మాబూన్నిసాకు అందచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణ, రమాదేవి, లీలావతి, చెన్నమ్మ, ఆయాలు పాల్గొన్నారు.



విజయవాడకు తరలించడానికి సిద్ధం చేసిన బియ్యం ప్యాకెట్లు



సేకరించిన వస్తువులతో అంగన్‌వాడీలు, ఆయాలు

పవర్‌లూమ్స్ నుంచి చేనేత పరిశ్రమను కాపాడండి

ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేనేత కార్మికుల నిరసన

ధర్మవరం, సెప్టెంబరు 19 : పవర్ లూమ్స్ నుంచి చేనేత పరిశ్రమను కాపాడాలని చేనేత కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగుమధు డిమాండ్ చేశారు. ఈ మేరకు చేనేత నాయకులు, కార్మికులు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ... ధర్మవరం పట్టణంలో చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి విచ్చలవిడిగా పవర్‌లూమ్స్‌లో పట్టుచీరలు తయారు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ రిజర్వేషన్ చట్టాన్ని కాపాడాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి చేనేత కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. దీంతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి.. కుటుంబాన్ని పోషించుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ధర్మవరం సమీపంలో ఒకే బిల్డింగ్‌లో 100 నుంచి 200 వరకు పవర్ లూమ్స్ మగ్గాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేస్తున్నా... ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదన్నారు. ఈ నెల 25న బత్తలపల్లి మండలం వేల్పుమడగు వద్ద ఉన్న జేఆర్ సిల్క్ ఫ్యాక్టరీని ముట్టడి స్తామన్నారు. అనంతరం ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో చేనేత కార్మికసంఘం నాయకులు వెంకటస్వామి, రవికుమార్, రమణ, చెన్నంపల్లి శ్రీనివాసులు, చట్టా రవి, శ్రీధర్, చట్టా గంగాధర్, సురేశ్, బాలరంగయ్య పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న చేనేతలు

ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయండి: ఎమ్మెల్యే

కొత్తచెరువు, సెప్టెంబరు 19 : రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ జిల్లా అధికారి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ కార్యక్రమం లో ఆమె మాట్లాడారు. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బారాన్‌సాబ్, వ్యవసాయ అధికారి నటరాజ్, నాయకులు సాలక్కగారి శ్రీనివాసు లు, అడపాల రామకృష్ణ, ఒలిపి శీన, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా, జనసేన నాయకులు పత్తిచంద్రశేఖర్ పాల్గొన్నారు.

బుక్కపట్నం: బుక్కపట్నంలోని రైతు సేవా కేంద్రంలో ఉలవలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. బుక్కపట్నం, మరాల రిజర్వాయర్‌లను కృష్ణ జలాలతో నింపి రైతులను ఆదుకుంటామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.

పుట్టపర్తిరూరల్: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ప్రత్యామ్నయ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 23లోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లావ్యవసాయ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

పాలాభిషేకం

పుట్టపర్తి : తమ సమస్యను పరిష్కరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆధ్వర్యంలో సత్యసాయి వాటర్ ప్రాజెక్టు కార్మికులు గురువారం సాయంత్రం హనుమాన్ కూడలిలో పాలాభిషేకం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం జీతాలివ్వకుండా తమను వేధించిందని, కూటమి ప్రభుత్వం కార్మికుల కష్టాలను గుర్తించి రూ. 30 కోట్ల విడుదల చేసిందని అన్నారు.



కొత్తచెరువులో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే , మాజీ మంత్రి

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 19: నీకేపల్లి మండలం గంగినేపల్లిలో గ్రామ సచివాలయంలో ఈ నెల 13న పంచాయతీ కార్యదర్శి రాముపై గంగినేపల్లి సర్పంచు శాంతమ్మ భర్త రాజు, మామ పక్కీరప్ప దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ కార్యదర్శి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంమోహన్, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్, జైపాల్‌రెడ్డి జిల్లా పంచాయతీ అధికారి శివకుమారి, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులకు గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణచేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. కార్యక్రమంలో జిల్లాపంచాయతీ కార్యదర్శులు సంఘం గౌరవాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సూర్యచంద్రరెడ్డి, త్రివేణి, రాము, శిరీష, గోపి, చక్రి, బేగ్, హనుమంతురెడ్డి, భాస్కర్, శీనా, శంకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.



డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

భర్త హత్య కేసులో భార్య, ప్రియుడి అరెస్ట్

కదిరి అర్బన్, సెప్టెంబరు 19 : మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన రమేష్ (37) హత్య కేసులో అతని భార్య రమ్య, ఆమె ప్రియుడు అదే గ్రామానికి చెందిన గంగరాజును పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు.. రమేష్ స్టీల్ సామన్లు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. రమ్య, గంగరాజు మధ్య వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయమై భార్యాభర్తలు పలుమార్లు గొడవపడ్డారు. ఈనెల 9న రాత్రి రమ్య గంగరాజుతో వీడియో కాల్‌లో మాట్లాడుతుండగా.. రమేష్ గమనించి.. ఘర్షణ పడ్డాడు. అనంతరం రమేష్ నిద్రపోగా.. అర్ధరాత్రి రమ్య, గంగరాజు కలిసి.. కత్తితో పొడిచి హత్య చేశారు. తన భర్త అతిగా మద్యం తాగి... బీరు బాటల్‌పై పడడతో మరణించినట్లు రమ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే కత్తితో పొడవడంతోనే రమేష్ మరణించినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. దీంతో పోలీసులు రమ్యను తమదైన శైలితో విచారించగా.. అసలు విషయం వెలుగుచూసింది. వారిద్దరిపై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించారు.

బస్సులు ఏర్పాటు చేయాలి

ధర్మవరం, సెప్టెంబరు 19 : గ్రామీణ ప్రాంతాల నుంచి ధర్మవరం పట్టణానికి రోజు వస్తున్న విద్యార్థులకు అనుగుణంగా.. వేళకు తగినన్ని బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని పీఎస్‌యూ పట్టణ అధ్యక్షుడు కిశోర్ కోరారు. గురువారం ఈ మేరకు ఆర్టీసీ అధికారి ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సులను నమ్ముకుని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వందలాదిమంది విద్యార్థులు పట్టణానికి పాఠశాల, కళాశాలలు వస్తున్నారన్నారు. వారికి సమయానికి బస్సులు లేకపోవడంతో ప్రమాదమని తెలిసినా ఆటోలో టాప్‌పై ప్రయాణిస్తున్నారన్నారు. గ్రామీణ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వేళకు.. తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే డిపో ఎదుట ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల విద్యార్థిసంఘం నాయకులు సాయి, పురుషోత్తం, గణేశ్, భారత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

కొత్తచెరువు, సెప్టెంబరు 19: సమగ్రశిక్ష కింద నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్, టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాలకు సంబంధించి రెండేళ్ల బకాయిలను చెల్లించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు విద్యాశాఖ ఏడీ నాగరాజుకు గురువారం సాయంత్రం వినతిపత్రాన్ని అందించిన వారు మాట్లాడారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. పనుల కేటాయింపులో భాగంగా ఎస్జీటీ ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్‌లుగా నియమించారని, వారికి ప్రత్యేక అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నేత కోనంకి చంద్రశేఖర్, నాయకులు రవిచంద్ర, విజయ్, రామాంజి, అనిల్, నారాయణస్వామినాయక్, సేవేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం

కదిరి, (అమడగూరు), సెప్టెంబరు 19 : మండలంలోని తుమ్మల పంచాయతీలోని పలు గ్రామాల్లో గురువారం ఎంపీడీఓ మునియప్ప ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనరసమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అనిల్, స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ ఆదినారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థలాలను శుభ్రంగా ఉంచుకోండి


ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న కార్యదర్శి, నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 19: మండలకేంద్రంలో సొంత స్థలాలు, ప్లాట్లు కలిగిన యజమానులు వాటిలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని మేజర్ పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు సూచించారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి స్థలాలను టీడీపీ నాయకులు చంద్ర, సూరి, రమణతో కలిసి పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ దోమలవల్ల వ్యాప్తిచెందుతాయన్నారు. నిర్దేశిత గడువులోగా స్థలాలను శుభ్రపరుచుకోకపోతే పంచాయతీ బోర్డులు నాటి, భవిష్యత్తులో ఆ స్థలాల్లో నిర్మాణాలకు ఒప్పుకునేది లేదని హెచ్చరించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అటవీ అధికారి

పెనుకొండ, సెప్టెంబరు 19: జేవీవీ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల్లో మన పర్యావరణం మన చేతుల్లోనే కార్యక్రమంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్యావరణం సమతుల్యాన్ని కాపాడటంలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని వక్తలు అన్నారు. పర్యావరణం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. జనవిజ్ఞాన వేదిక సైన్స్ ప్రచార కార్యక్రమాలతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఇటువంటి కార్యక్రమాలు చేయడం హర్షణీయమన్నారు. ముఖ్య అతిథులుగా ఫారెస్ట్ రేంజ్ అధికారి, సత్యసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ మూర్తి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతాహి సేవ


కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పెనుకొండ, సెప్టెంబరు 19: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలోని మొక్కల చుట్టూ ఉన్న కలుపుమొక్కలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పీఓలు పాల్గొన్నారు.

బాల్య వివాహం.. నేరం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 19: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ కోఆర్డినేటర్ గణేష్ అన్నారు. గురువారం రొద్దంలో టింబక్టివ్ కలెక్టివ్ సహకారంతో ప్రతిభ వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో లీగల్ క్యాంప్ నిర్వహించారు. వికలాంగ చట్టాలు, మేనరిక వివాహాలు, వారి ఇబ్బందులు నాటిక రూపంలో వివరించారు. సొసైటీ సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి


నరసింహమూర్తి(ఫైల్)

గుడిబండ, సెప్టెంబరు 19: మండలంలోని ఎన్ఆర్ రొప్పం గ్రామానికి చెందిన నరసింహమూర్తి(40) అనే టీడీపీ కార్యకర్త బుధవారం అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నరసింహమూర్తి కుటుంబ సభ్యులను టీడీపీ అన్నివిధాలా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

దేమకేతేపల్లి వీఆర్ఓ..


శ్రీనివాసులు (ఫైల్)

చిలమత్తూరు, సెప్టెంబరు 19: అనారోగ్యంతో బాధపడుతూ దేమకేతేపల్లి గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు (38) గురువారం మృతి చెందాడు. ఆయన కొంత కాలంగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా తీవ్రమైన అనారోగ్యం రావడంతో చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. వీఆర్వో శ్రీనివాసులు మృతి చెందడంతో తోటి ఉద్యోగులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మడకశిరటౌన్, సెప్టెంబరు 19: మండలంలోని ఇ.అచ్చంపల్లి గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న తిమ్మయ్యను అరెస్టు చేసినట్లు మడకశిర అర్బన్ సీఐ రామారావు తెలిపారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. గ్రామంలో తిమ్మయ్య కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి మద్యాన్ని సీజ్‌చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 4.7 లీటర్ల మద్యం, 17 90ఎంఎల్ హైవార్డ్స్, 13 ఓటీ, 10 రాజా బాటిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు.

సీ కొడిగేపల్లిలో చిరుత సంచారం

మడకశిర రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని సీ కొడిగేపల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక రైతులు వెంకటరెడ్డి, నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. సీ కొడిగేపల్లి, కేతేపల్లి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందన్నారు. సాయంత్రం పశువులను పొలాలు నుంచి ఇంటికి తీసుకువస్తున్న సమయంలో ముళ్లపొదల నుంచి నుంచి చిరుత పశువులపై దాడికి యత్నించినట్లు తెలిపారు. అక్కడున్న వారు అరుపులు కేకాలు వేయగా చిరుతు అటవీ ప్రాంతంలోకి పరుగులు తీసినట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుత నుంచి ప్రజలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

కల్లు కుండల ధ్వంసంపై ఫిర్యాదు


పగిలిన కుండలను పరిశీలిస్తున్న సీఐ

గోరంట్ల, సెప్టెంబరు 19: మండలంలోని బీఎన్ తండా వద్ద ఈత చెట్ల నుంచి కల్లు తీసున్న 70 కుండలను పగలకొట్టారని, బాధితుడు ఈడిగ ఓబులప్ప గురువారం సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేశారు. తండా వద్ద ఈత చెట్లనుంచి నిత్యం సేకరించిన కల్లును పాలసముద్రం సమీపంలోని దుకాణంలో విక్రయించి జీవనం సాగిస్తున్నారు. 70 ఈతచెట్లకు ఏర్పాటు చేసిన కుండలను పగలకొట్టగా గురువారం గుర్తించామని బాధితుడు ఫిర్యాదులో తెలిపారు. గతంలో కూడా రెండు నిచ్చెనలను ఎత్తుకెళ్లారన్నారు. ప్రస్తుతం కుండలు పగలకొట్టి నష్టం కలిగించారన్నారు. ఇందుకు బాధ్యులైనవారిని గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు. సీఐ శేఖర్ స్పందిస్తూ స్వయంగా సంఘటనాస్థలానికెళ్లి పరిశీలించారు.

పంట కోసం పాట్లు

జిల్లా రైతు ఏటా పంటపెట్టి నష్టపోతున్నాడు. అప్పులు చేసి వ్యవసాయం చేస్తూనే ఉన్నాడు. ఈసారి కూడా మరిన్ని అప్పులు చేసి, పంట సాగు చేశాడు. పంట కాయలు ఏర్పడే కీలక దశలో వరుణుడు ముఖం చాటేశాడు. దీనికితోడు ఎండలు మండిపోతున్నాయి. వెరసి పంట చేలు ఎండుముఖం పట్టాయి. ఈసారి పంటను కోల్పోతే భవిష్యత్తు దుర్భరమౌతుందని అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని పడరాని పట్లు పడుతున్నాడు. నీటిని కొని, ట్యాంకరు ద్వారా చేనుకు తడులిస్తున్నాడు. గోరంట్ల మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన రైతు సోమశేఖర్ కోరేవాండ్లపల్లి సమీపాన రెండెకరాల్లో వేరుశనగ సాగు చేశాడు. చెట్లు ఎండిపోతుండడంతో సొంత ట్యాంకర్ ద్వారా పక్కపొలం రైతు బోరు నుంచి నీటిని తీసుకుని, తడులిస్తున్నాడు. ఎకరా పంట తడపడానికి 7 ట్యాంకర్లు అవసరమని రైతు చెబుతున్నాడు. ట్యాంకర్‌కు రూ.350 ఖర్చు వస్తోందంటున్నాడు. ట్యాంకర్‌లేని రైతులైతే ట్యాంకర్‌కు రూ.700 చెల్లించాల్సి ఉందని వాపోతున్నాడు. ప్రభుత్వం గతంలో రెయిన్ గన్లు ఏర్పాటు చేసిన తరహాలోనే ప్రస్తుతం వేరుశనగకు రక్షక తడులు అందించాలని కోరుతున్నారు. -గోరంట్ల


పొలంలో ట్యాంకరు


ట్యాంకరు నీటితో వేరుశనగ పంటను తడుపుతున్నరైతు

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 19: రక్తదానం చేసి ప్రాణదాతలు కండని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నరేంద్రమోదీ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా పక్వాడ్ పక్షత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సురువు రామంజనేయులు, తిరుపతి ఇన్‌చార్జి పార్థసారథి, సంపర్క్ అభియాన్ రాష్ట్ర నాయకుడు మేడకుర్తి హరి, 11వ వార్డు కౌన్సిలర్ అంజలీ, అమర్ దేవేంద్ర, భాగ్యలక్ష్మీ గౌడ్, వరప్రసాద్, తిరుమలేష్, ఆదర్శ్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకుడు

మడకశిరటౌన్: ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి రమణమూర్తి అన్నారు. గురువారం పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. దేశాభివృద్ధికి ప్రధాని చేస్తున్న కృషిని వివరించారు. రూరల్ మండల కన్వీనర్ రామదాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి జయరాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్‌కు చివరి అవకాశం

చిలమత్తూరు, సెప్టెంబరు 19: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ బుకింగ్‌కు 23వ తేదీ చివరి అవకాశం అని ఏఓ వంశీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 6234 మంది రైతులకు సంబంధించి 12,451 ఎకరాల్లో సాగువుతున్న పంటల వివరాలను ఈ-క్రాప్ ద్వారా నమోదుచేసినట్లు తెలిపారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 19: అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో గురువారం వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణేష్, ఎస్సీసెల్ నియోజవకర్గం అధ్యక్షులు జయకుమార్ పాల్గొన్నారు. 13 రోజులపాటు పూజలు అందుకొన్న వినాయకుడు టీడీపీ నాయకులు గురువారం విశేష పూజలు జరిపించారు. అనంతరం వినాయకులను నిమజ్జనానికి తరలించారు.

వినాయక మండప నిర్వాహకులకు నోటీసులు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 19: వినాయక నిమజ్జనంలో నిబంధనలు అతిక్రమించారంటూ పట్టణానికి చెందిన ఐదు మండపాల నిర్వాహకులకు పోలీసు శాఖ గురువారం నోటీసులు జారీచేసింది. పట్టణంలో ఈనెల 13న వినాయక నిమజ్జనం నిర్వహించిన సంగతి తెలిసిందే. పోలీసులు ముందస్తుగా వినాయక మండప నిర్వాహకులకు కొన్ని నిబంధనలు సూచించారు. భారీ వినాయకులను నిమజ్జనానికి నిర్ణీత సమయంలోగా తరలించాలని చెప్పారు. పట్టణంలో ఏర్పాటు చేసిన వాటిలో గరిడీ గణపతి, సూరప్పకట్ట మహాగణాధిపతి, ముక్కడిపేట విశ్వసేనా గణపతి, అంబేడ్కర్, బాపూజీనగర్ విగ్రహాలు చాలాపెద్దవి. వాటిని నిమజ్జనానికి తరలించే విషయంలో చాలా ఆలస్యమైంది. తద్వారా రెండురోజులపాటు విద్యుత్ సరఫరాలేక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భద్రత కల్పించే విషయాంలో పోలీసు సిబ్బందికి కూడా తిప్పలు తప్పలేదు. ఈ నేపథ్యంలో పోలీసు సూచనలు ఎందుకు పాటించలే దో తెలియజేయాలంటూ పోలీసు శాఖ నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని డీఎస్పీ మహేష్ తెలిపారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

పెనుకొండ, సెప్టెంబరు 19: నగర పంచాయతీలో అన్నిరకాల పన్నులను వందశాతం వసూలు చేయాలని కమిషనర్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ఆదేశించారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలంలో సచివాలయ సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు అందరూ కృషి చేయాలన్నారు. రోజువారి వీధులు, బయోమెట్రిక్ అటెండెన్స్, జాబ్‌కార్డ్ ప్రకారం సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ప్రజా గ్రీవెన్స్, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

'త్వరలోనే తల్లి పార్టీలోకి పిల్లపార్టీ'

హిందూపురం, సెప్టెంబరు 19: త్వరలోనే కాంగ్రెస్ పార్టీలోకి వైసీపీ విలీనం కావడం ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప అన్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ చేసిన దౌర్జన్యాలు, దందాలతో విసిగిపోయిన ప్రజలు రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విదంగా కూటమికి అధిక సీట్లు కట్టబెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనతో వైసీపీ దిక్కుతోచని స్థితిలో పడిందన్నారు. కాంగ్రెస్‌పార్టీలో వైసీపీ విలీనం కావడం ఖాయమన్నారు.

కార్యకర్తకు పరామర్శ

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 19: మండల కేంద్రంలోని వినాయకనగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త నీరుగంటి నాగరాజు ప్రమాదవశాత్తు జారిపడి గాయపడ్డాడరు. విషయం తెలుసుకున్న టీడీపీ స్థానిక నాయకులు హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, కన్వీనర్ సిద్దలింగప్ప, టౌన్ కన్వీనర్ సూరీ, ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, టీఎన్ఎస్ఎస్ సతీష్ గురువారి కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10వేలు, రెండు బియ్యం బస్తాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్యకర్త కోలుకునేవరకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో లాలీ సతీష్, నీరుగంటి అశోక్, నాగరాజు, గాండ్ల నరేంద్ర పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ ప్రారంభం

గుడిబండ, సెప్టెంబరు 19 : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓ రవిచంద్రకుమార్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్కూల్‌గేమ్స్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, ఎంజేపీ, ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు.


గుడిబండ: లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థి


పరిగిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

హిందూపురం(పరిగి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అథ్లెటిక్స్ గేమ్స్ నిర్వహించారు. ఎంఈఓ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ నరసింహం ముఖ్య అతిథులుగా హాజరై ఆటల పోటీలు ప్రారంభించారు. పరుగుపందెం, ఖోఖో, కబడ్డీ, యోగా, తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. పంచాయతీ కార్యదర్శి అరుణ, పీఈటీ మహేష్‌దీపక్, వినోద్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

● ఐదుగురికి గాయాలు

హిందూపురం, సెప్టెంబరు 19: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా ఐదుగురు గాయపడ్డారు. హిందూపురం మండలం నక్కలపల్లి వద్ద గురువారం ముళ్లకంపలు తొలగిస్తున్న సంతోష్‌కుమార్(20) అనే యువకుడిని ఎక్స్‌కవేటర్ వెనక్కు వచ్చే సమయంలో ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపిన మేరకు అనంతపురానికి చెందిన కోనేటి నారాయణ స్వామి ఐదేళ్లుగా హిందూపురం ప్రాంతంలో జపాన్ తుమ్మ చెట్లు తీసుకుని బొగ్గులు కాల్చుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సోమందేపల్లి మండలానికి చెందిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్ మస్తాన్ ముళ్ల కంపలు తొలగిస్తూ వెనక్కు వస్తున్న సమయంలో పక్కనే ఉన్న సంతోషకుమార్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే హిందూపురం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉంటే తన కుమారుడికి ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌కు కొంతకాలంగా మనస్పర్థలున్నాయని దీంతో కావాలనే ఢీకొట్టి తన కుమారుడిని చంపాడంటూ తండ్రి నారాయణ స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు: హిందూపురం-పెనుకొండ ప్రధాన రహదారిలోని కొల్లకుంట ఇందిరమ్మ కాలనీవద్ద ప్రైవేట్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో మణేసముద్రంకు చెందిన కళ్యాణ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. గురువారం ద్విచక్ర వాహనంలో కళ్యాణ్‌కుమార్ హిందూపురానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొంది. ద్విచక్రవాహనం బస్సు కిందకు దూసుకెళ్లగా వ్యక్తిని బస్సు ఢీకొని పక్కకు పడ్డాడు. దీంతో అతడు గాయపడ్డాడు. అతనిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నారు.


బస్సుకిందకు దూసుకుపోయిన ద్విచక్రవాహనం

కాంగ్రెస్ నాయకుడికి...

మడకశిరటౌన్/రూరల్: మండలంలోని బచ్చలవాయిపాళ్యం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బి.ఎన్.నరసింహమూర్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గురువారం సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక రాష్ట్రం మధుగిరి నుంచి సొంత గ్రామానికి కారులో వస్తున్న సమయంలో మల్లినాయకనపల్లి గ్రామ సమీపంలో బొలేరో వాహ నం ఢీకొనడంతో న రసింహమూర్తి తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

హిందూపురం(సోమందేపల్లి): మండలంలోని కియ అనుబంధ సంస్థ స్లాప్ వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు టమోటాలోడ్‌ను బెంగళూరులో అన్లోడ్ చేసి సీకే పల్లి వెళ్తున్న బొలేరో వాహనం స్లాప్ కంపెనీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో బొలేరో డ్రైవర్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు

హిందూపురం(పరిగి): మండలంలోని రెయిన్‌బో పాఠశాల సమీపంలో కొడికొండ-శిర హైవేపై గుర్తుతెలియని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు పరిగి నుంచి లేపాక్షికి ద్విచక్రవాహనంలో వెళ్తున్న యువకులను కొడికొండ వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో వెంకటేశ్, రంగ తీవ్రంగా గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడు తెలిపారు.

పర్యావరణ సమతుల్యత అందరి బాధ్యత


డైనోసర్ మట్టి బొమ్మను చూపుతున్న దృశ్యం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 19: పర్యావరణ సమతుల్యత మన అందరి బాధ్యత అని ఎంఈఓ గంగప్ప వివరించారు. 18, 19 తేదీల్లో హిందూపురంలోని ఎంజీఎం, చిన్మయ పాఠశాలల్లో నిర్వహించిన పర్యావరణ విద్య బయో డైవర్సీ ఆఫ్ స్కూల్ గురించి విద్యార్థులకు వివరించారు. విశ్వంలో జంతువులు, మొక్కలు గురించి తెలియజేస్తూ వాటిని ఏ విధంగా పరిరక్షించుకోవాలో డాక్టర్ యోగేశ్వర్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలియజేశారు. సీనియర్ టెక్నీషియన్ శ్రీనివాసులు డైనోసర్ బొమ్మను మట్టితో తయారు చేసి విద్యార్థులకు చూపించారు. విద్యార్థులతో వివిధ టీచ్ మోడల్‌లు తయారు చేయించారు. ఎంఈఓ-2 ప్రసన్నలక్ష్మీ, చిన్మయ హెచ్‌ఎం సరళ పాల్గొన్నారు.

పంచాయతీ అధ్యక్షురాలిగా లలితమ్మ


అధ్యక్షురాలు, సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ, సెప్టెంబరు 19: సాసలకుంట గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా జేడీఎస్ పార్టీకి చెందిన లలితమ్మ రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో లలితమ్మ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె అధ్యక్షురాలిగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ వరదరాజు ప్రకటించారు. మొత్తం 17మంది సభ్యుల్లో జేడీఎస్ పార్టీ సభ్యులు 11మంది కాంగ్రెస్ సభ్యులు ఆరుగురు ఉండగా ఎలాంటి పోటీ లేకుండా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. అధ్యక్షురాలిగా ఎంపికైన లలితమ్మ, జేడీఎస్ నాయకులు నారాయణరెడ్డి, మోహన్‌కుమార్, వీరలింగారెడ్డి, రెడ్డప్ప, దయానందరెడ్డి, వివిఎస్ఎన్ అధ్యక్షుడు శివన్న, జేడీఎస్ నాయకులు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

రాగిపంటపై రైతులకు అవగాహన


రాగి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సనావుల్లా

అగళి, సెప్టెంబరు 19: మండలంలోని ఇనగలూరు గ్రామ పంచాయతీ తొలసనపల్లి గ్రామంలో పొలంబడిపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏఓ శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ సనావుల్లా, ఏఓ అబ్దుల్ అలీ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాగి పంటతో తక్కువ పెట్టుబడి ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. దీనివల్ల అధిక లాభాలు గడించవచ్చన్నారు. రైతులు ప్రతి ఒక్కరూ రాగి పంటను సాగుచేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, జడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉలవల పంపిణీ


రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 19: అమరాపురంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం వ్యవసాయ అధికారి మంజునాథ్, మండల కన్వీనర్ గణేష్ రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటగా ఉలవలను ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో రైతుసేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకొన్న రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. 10 కిలోల ఉలవల ధర రూ.870 ఉండగా 80 శాతం రాయితీతో రూ.696 పోగా రైతుకు రూ.174లకే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండల కన్వీనర్ గణేష్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, మాజీ ఎంపీపీలు కృష్ణమూర్తి, మీనాక్షిరామిరెడ్డి, నాయకులు మారుతీప్రసాద్, దాదాపీర్‌పాల్గొన్నారు.

గుడిబండ: ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టిసారించాలని ఏఓ వీరనరేష్, టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప సూచించారు. గురువారం మండలంలోని మందలపల్లి ఆర్బీకే కార్యాలయంవద్ద రైతులకు ఉలవలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు లక్ష్మీనరసప్ప, సన్నమారెప్ప, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం


బాధితుడు రవీంద్రనాయక్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 19: మండలంలోని పాపన్నపల్లి తండాకుచెందిన టపార్టీ కార్యకర్త రవీంద్రనాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా, టీడీపీ నాయకులు గురువారం ఆర్థికసాయం అందచేశారు. ఇటీవల పాలసముద్రం వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకున్న సంఘటనలో రవీంద్రనాయక్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స అనంతరం లేవలేని స్థితిలో ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా టీడీపీ నాయకులు వెళ్లి పరామర్శించారు. రూ.10,500, నిత్యావసర వస్తువులను బాధితుడు తల్లి తాళీబాయికి అందచేశారు. అదే గ్రామానికి చెందిన శివశంకర్‌నాయక్ మరో చోట ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడగా అతనిని పరామర్శించారు. నాయకులు బెల్లాలచెరువు చంద్ర, మనోహర్, జయచంద్రారెడ్డి, గంగాధర్, ఇర్షాద్, వెంకటరమణ, ఆంజనేయులు, పరమేష్‌నాయక్, శంకర్‌నాయక్, రామస్వామి నాయక్, కాటేపల్లి ఆంజి, మల్లి, ఉదయ్, శంకర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై బాలికలు శ్రద్ధచూపాలి


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అగళి, సెప్టెంబరు 19: బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని పీహెచ్ఎన్ లక్ష్మీదేవి సూచించారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ చదువుతున్న బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు హెచ్‌బీ పరీక్ష, ఐరన్ టాబ్లెట్లతో పాటు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వారికి మందులను పంపిణీ చేశారు. ఎస్ఓ నాగరత్నమ్మ, వైద్య సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.